తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి


www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాదాద్రి భువనగిరి

ఆదివారం
23 ఫిబ్రవరి 2025 | పేజీలు : 8


## డ్రైవర్ టూ పీఏ..!!



◆ సరికొత్త జర్నీలో ఎన్నో మలుపులు ◆ అన్నా.. అంటూ అన్నింటిలో వేలు పెట్టాడు ◆ మగువ, మందు, విందులతో జల్సా చేసాడు ◆ ఇసుక, మట్టీ, కబ్జాల్లో ఆరితేరాడు

సినిమా కథలతో పాటు నిజ జీవితంలో అనేక మంది నాయకులు, వ్యాపారస్థులు కింది స్థాయి నుంచి ఎదిగి సమాజంలో అనేక మందికి ఆదర్శంగా నిలుస్తారు. వారు ఎదిగిన తీరుని చూసి సామాన్య ప్రజలు హర్షిస్తారు. ఇప్పుడు చెప్పబోయే కథలో ఓ వ్యక్తి చిరు "మామూళ్ల" తో "కిరణం" లా వెలిగిన తీరు గురించి తెలుసుకుందాం.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** సంపన్నుడైన ఓ వ్యక్తిని విధి వంచించి అనుకోకుండా ప్రమాదం జరుగుతుంది. ప్రమాదంలో సంపన్నుడికి తీవ్ర గాయాలు అవుతాయి. ఆ గాయాలే అంబులెన్స్ డ్రైవర్నీ, పర్సనల్ డ్రైవర్ గా మారడానికి పునాదులు వేసాయి. అతని జీవితంలో అక్రమాలు చేసేందుకు, ధనార్జనకు అక్కడే బీజం పడింది. అనుకోకుండా ఆ సంపన్నుడికి రాజకీయ ప్రవేశం లభించడంతో పాటు వచ్చి రాగానే విజయం వరించింది. గెలిచింది ఒక పార్టీ నుంచైనా మరో పార్టీలోకి ఆహ్వానం అందింది. ఆ సంపన్నుడు కారులో వెళ్లి కండువాను మార్చేసు కున్నాడు. ఆ సంపన్నుడికి కారు సవారిలో యువరాజు దగ్గరివాడవ్వడంతో రాజయోగం వరించింది. సంపన్నుడికి వరం దక్కిందే తరువాయి "మామూళ్ల కిరణాలు" గులాబీ వనాన్ని చెరిచాయి. ఈ కథలో సంపన్నుడు మాజీ మంత్రి అయితే పిఏ మాజీ మంత్రికి ఒకప్పటి డ్రైవర్.

**ఉద్యోగమే అతనికి దొరికిన ఆయుధం**

ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఎన్నడూ జరగని అవినీతి మాజీ మంత్రి హాయాంలో జరిగిందంటే దానికి ప్రధాన కారణం అతని డ్రైవర్ కమ్ పిఏ అని మిగతా2లో

## పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

• నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదు • జిల్లాలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలి • జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** మార్చిలో జరిగే పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు.శనివారం కలెక్టరేట్ లో డీఈఓ అశోక్ తో కలిసి జిల్లాలోని హైస్కూల్ హెడ్ మాస్టర్లు, మండల విద్యాధికారులు, సీఎస్ లు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 21 నుండి ఏప్రిల్ 4 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలను జిల్లాలో నిర్వహించుటకు అధికారులు అందరూ సన్నద్ధంగా ఉండాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పకడ్బందీగా నిర్వహించుటకు కృషి చేయాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.అందుకు గాను పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని ప్రతి పరీక్ష కేంద్రంలో త్రాగునీరు, వెంటిలేషన్, లైటింగ్, బల్లలు ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు.విద్యార్థులు కింద కూర్చోబెట్టి పరీక్షలు రాయించకూడదని అన్నారు. ప్రతి విద్యార్థిని పరీక్ష హాల్లోకి అనుమతించే ముందు గేటు వద్దనే క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మగ విద్యార్థులను మగ ఉపాధ్యాయులతో, ఆడ పిల్లలను లేడీ టీచర్స్ తో తనిఖీ చేయాలని పేర్కొన్నారు. సెల్ ఫోన్లను పరీక్ష హాల్ లోకి అనుమతించకూడదని అన్నారు.సీసీ కెమెరాలున్న పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో ముందుగానే 18 లోపు రిపోర్టు సమర్పించాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థులను తనిఖీ చేసేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ, పరీక్షా పనిలో పాల్గొనని వ్యక్తులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించ రాదన్నారు.అదే ప్రాంగణంలో ఏ మరియు బి కేంద్రాలు ఉంటే, డిఈఓ, ప్రధాన సూపరింటెండెంట్స్ , రెండు కేంద్రాల డిపార్ట్మెంటల్ అధికారులకు తగినంత వసతి, ఫర్నిచర్, ఇతర అవసరాలను అందించాలని తెలిపారు. ప్రశ్న పత్రాలను ఇన్విజిలేటర్లకు అప్పగించే ముందు ప్రశ్న పత్రాలను మిగతా2లో

## ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారం కొరకు కృషి చేస్తాం : ఎస్పి

◆ డిండి పోలీస్ స్టేషన్ను సందర్శించి పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐ.పి.యస్ ◆ మీట్ యువర్ ఎస్పి కార్యక్రమంలో పలు ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పి ◆ సుదూర ప్రాంతాల ప్రజలకు మండల స్థాయిలోనే తక్షణ పరిష్కార దిశగా చర్యలు




**దేవరకొండ,ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని డిండి పోలీస్ స్టేషన్ ను సందర్శించి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిసరాలు, స్థితిగతులు గురించి యస్ఐ గారిని అడిగి తెలుసుకుని, రిసెప్షన్, స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ, భాదితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరి%శీ%చి బాధితులకు తగు న్యాయం జరిగేలా పోలీస్ సిబ్బంది పనిచేయాలని, సామాన్యుడు పోలీస్ స్టేషన్ కి వస్తే తగు న్యాయం జరుగుతుంది అనే నమ్మకం కలగజేసేల పని చేయాలని,అప్పుడే ప్రజలలో పోలీస్ శాఖ పైన నమ్మకం కలుగుతుంది అన్నారు. అనంతరం పోలీసు స్టేషన్లో నిర్వహించిన మీట్ యువర్ ఎస్పి కార్యక్రమానికి మండల పోలీసు స్టేషన్ పరిధిలోని విశేష స్పందన వచ్చింది.మండల పరిధిలోని దాదాపు 26 మంది పిర్యాదు దారులు ఎక్కువగా భూ సమస్యలు,కుటుంబ వివాదాల పైన,జాబ్ ఇప్పిస్తామని మోసం చేశారని, సైబర్ క్రైమ్ మోసలు వివిధ సమస్యల పట్ల యస్. పి గారిని కలవడం జరిగింది.జిల్లా ఎస్పి గారు పిర్యాదారులతో వారి సమస్యల పట్ల ముఖాముఖి మాట్లాడి, పరిశీలించి సత్వర పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలు జిల్లా కేంద్రానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారని దీని కొరకు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిస్కరించుటయే ధ్యేయంగా ఈ యొక్క ప్రోగాం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ ల పరిదిలో మీట్ యువర్ ఎస్పి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారం కొరకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి గారి వెంట ఏఎస్పి మౌనిక ఐపీయస్,డిండి సి.ఐ సురేష్, యస్.ఐ రాజు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి జంగిటి కైలాసంను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్వీ)
వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అభ్యర్థి జంగిటి కైలాసం



**సూర్యాపేట (జనంసాక్షి):** వరంగల్, ఖమ్మం, నల్లగొండ, నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ ఉద్యమకారులు, రిటైర్డ్ ప్రధానో పాధ్యాయులు జంగిటి కైలాసంను ప్రభుత్వ, ప్రయివేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, రెసిడెన్సిల్ స్కూల్, కేజీబీవీ, కాంట్రాక్టు మరియు ప్రైవేట్ ఉపాధ్యాయులు, బ్యాలెట్ పేపర్ లోని సీరియల్ నెంబర్ 11లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు (ఆర్వీ), ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి జంగిటి కైలాసం కోరారు. జిల్లా కేంద్రంలో మిగతా2లో

## పదో తరగతి వార్షిక పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

సబ్జెక్ట్, కోడ్‌కు సరిగ్గా ధృవీకరించాలని, ఏదైనా ప్యాకింగ్ తప్పులు ఉంటే, అటువంటి ప్రశ్న పత్రాలను చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుకు సంయుక్తంగా వెంటనే తిరిగి ఇచ్చివేయాలని, గోప్యంగా మూసివేయాలని అన్నారు. ఇన్విజిలేటర్లు అభ్యర్థులకు తప్పు కలయిక యొక్క ప్రశ్న పత్రాలను జారీ చేయకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. వాటర్‌మెన్ ద్వారా నీటిని అందించడంతో పాటు పరీక్షా కేంద్రాల యొక్క వివిధ ప్రదేశాలలో నీటి కుండలను ఏర్పాటు చేయడం ద్వారా అభ్యర్థులకు తాగునీటి సౌకర్యాలు అందించాలని అన్నారు వేర్వేరు టాయిలెట్ సౌకర్యాలను పరీక్షా కేంద్రాలలో బాలికలకు, బాలురలకు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా హాలులో అంధ అభ్యర్థుల కోసం స్క్రైబర్ ను ముందుగానే నియమించాలన్నారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలలో జిల్లాలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని, అందుకుగాను హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. వార్షిక పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందువలన చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి సాయంత్రం పూట అదనపు క్లాసులు నిర్వహించాలని ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి శీనయ్య, హైస్కూల్ హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్స్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ అభ్యర్థి జంగిటి కైలాసంను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా టి యుటిఎఫ్ ను ఏర్పాటు చేశామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా గతంలో గెలిచిన వారు ప్రభుత్వంతో కలిసిపోయి ఉపాధ్యాయుల పిఆర్సీ, డిఏ, బకాయిలను మంజూరు చేయించడంలో విఫలమయ్యారని తెలిపారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయ అధ్యాపక మిత్రులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాద సంఘటన స్థలాన్ని (నాగర్ కర్నూల్ జిల్లా ,దోమలపెంట) నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరథ్ చంద్ర పవార్ లు శనివారం సందర్శించారు.ప్రమాదం జరిగిన తీరు, ప్రమాదం జరగడానికి గల కారణాలు, తదితర వివరాలను వారు అక్కడ ఉన్న ఇంజనీర్లు, ప్రమాదం నుండి బయటపడ్డ వారితో అడిగి తెలుసుకున్నారు.దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, ఏసిపి మౌనిక ఇతర అధికారులు ఉన్నారు.



జనం సాక్షి @ దేవరకొండ..

# డ్రైవర్ టూ పిఏ..!!



జిల్లా ప్రజల్లో ఎవరిని అడిగిన ఇట్టే చెప్పేస్తారు. అంబులెన్స్ డ్రైవర్ గా ఉద్యోగం దొరకడమే అతనికి దొరికిన ఆయుధం. దాన్ని సానపట్టి అన్ని విధాలుగా వాడుకున్నాడు. పార్టీ కార్యాలయంలో అన్ని తానై వ్యవహరించాడు. తన కంటూ ప్రత్యేక కోఠరీని ఏర్పాటు చేసుకున్నాడు. అధికారులను ఏకవచనంతో పిలిచి అవమానించడం, హేళనగా మాట్లాడటం వంటి వికృత చేష్టలకు పాల్పడటమే కాకుండా వారి నుంచి వసూళ్ల దందా మొదలు పెట్టాడు. అనేక మంది మహిళ నాయకులతో , అధికారులతో నీఛంగా వ్యవహరించడాన్ని మహిళలు చెప్పుకోలేక కుమిలిపోయారు. ద్వందర్థాలతో మాట్లాడటం పిఏ గారికి "మామూళ్ల" తో పెట్టిన విద్య. ఇసుక క్వారీల వారిని బెదిరించడంలో, మట్టీ క్వారీల వారిని బెదిరించడం, మట్టీ మాఫియా తమ బంధువులమని చెప్పుకొని అధికారుల పై దాడి చేసిన ఘటనలు సైతం ఉన్నాయి. జిల్లాలో పాలేరు టూ సీలేరు తన హవా కొనసాగుతుందని అనేక మంది మహిళలతో చాటింగ్ చేసిన ఘనుడు. మాజీ మంత్రికి తెలిసి జరిగిందా లేక తెలియక జరిగిందా అనేది అప్రస్తుతం. మాజీ మంత్రికి అన్ని డ్రైవర్ కమ్ పిఏ కావడంతో బహిరంగంగా చెప్పుకునే సహసం ఎవ్వరు చేయలేదు. డ్రైవర్ కమ్ పిఏ వెలగబెట్టిన ఘనకార్యం ఉంది. ఓ మహిళ మీ పిఏ తనకు అన్యాయం జరిగిందని మొర పెట్టుకోవడంతో, ఎన్నికల్లో ఇదే ప్రధాన అంశం అవుతుందని భావించిన మాజీ మంత్రి డ్రైవర్ కమ్ పిఏ ను పక్కన పెట్టాడు. మాజీ మంత్రికి అనుంగ్యులుగా వున్న కొందరు అక్రమ రాయుళ్లు, అవినీతి అధికారులు మాజీ మంత్రికి చెవిలో జోరిగలాగా దూరి డ్రైవర్ కమ్ పిఏ లేకపోతే ఆర్థిక లావాదేవిల్లో , వారి అక్రమాల్లో ఇబ్బందులు ఎదురౌతున్నాయని చెప్పుకోవడంతో ఆయన తానై తాను పెట్టుకుంటే వ్యతిరేకత వస్తుందని వీళ్లు చెప్పబట్టే పెట్టుకున్నానని చెప్పుకోవడం మొదలు పెట్టాడు. పీకేసిన కలుపు మొక్కను ఎంత పెద్ద మేధావి చెప్పిన ఎవరైనా పెట్టుకుంటారా లేదు కదా. పెట్టుకున్నాడు అంటే డ్రైవర్ కమ్ పిఏ ని ఎప్పుడెప్పుడు తీసుకుందామా అని అమాత్యుల మెదడులో తొలుస్తుండబట్టే మళ్లీ విధుల్లోకి తీసుకొని వీధుల్లోకి తోలాడు. వీధుల్లోకి వెళ్లిన పిఏ రాజకీయ నాయకుడిగా చెలామణి అయ్యాడు. టౌన్ ప్లానింగ్ అధికారులను బెదిరింపులకు పాల్పడి అక్రమ నిర్మాణ అనుమతులు ఇప్పించేవాడు. మట్టీ మాఫియా నుంచి అక్రమ వెంచర్ల నుంచి భారీగా ముడుపులు అందుకున్నాడు. కార్పోరేటర్లు అంటే పురుగు కంటే హీనంగా తీసి పడేసే వాడు. అమాత్యుడిని కలవాలి అంటే డ్రైవర్ కమ్ పిఏ అనుగ్రహం ఉండాల్సిందే లేకపోతే కలిసేది లేదు. పైగా సదరు కార్పోరేటర్ పై లేనిపోని చాడీలు జోడించి మాజీ మంత్రి చెవిలో ఊదేవాడు. డబ్బుల పంపకాల్లో మనోడి వాట ప్రత్యేకం. ఇసుక లారీలు, మద్యం ద్వారా అర్జించిన సొమ్ము అంత ఇంత కాదు. కొందరు కాంట్రాక్టర్లు ముట్టజెప్పిన వాటితో పూర్తి స్థాయి అపార్ట్మెంట్ నిర్మాణం చేపట్టి బినామిల పేర్లతో ఉంచాడు. మాజీ మంత్రి మళ్లీ పోటి చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయంటే దానికి వేళ్ల మీద లెక్క పెట్టే వాళ్లు కొందరు ఉంటే అందులో ఇతనిది చూపుడు వేలు పాత్ర. ఈ కథ సశేషం..!



## శ్రీ సరస్వతీ విద్యానిలయంకు పూర్వ విద్యార్థి చేయూత

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
తాను చదువుకున్న పాఠశాలకు 15 వేల రూపాయల విలువగల కార్యాలయ సామాగ్రి, టేబుల్స్, కుర్చీలను వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ మిరియాల సుధాకర్ సందర్శన సందర్భంగా ఈ సామాగ్రిని శ్రీ సరస్వతీ విద్యా నిలయం యాజమాన్య కమిటీ సెక్రటరీ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుండా రమేష్, తదితర కమిటీ సభ్యులకు ఎన్నారై వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రవి బహుకరించారు. ఈ సందర్భంగా యాజమాన్య కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నాణ్యమైన విద్యను అందించేందుకు పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అభివృద్ధి సభ్యులు పీవీ లక్ష్మీనారాయణ, డాక్టర్ దండ మురళీధర్ రెడ్డి, వాసవి క్లబ్ జిల్లా అధికారులు కృష్ణ, జోనల్ అధికారి తల్లాడ శ్రీనివాస్,గజ్జల వెంకటరెడ్డి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెంటాల సోమయ్య మృతి బాధాకరం

### మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య



**హుజూర్ నగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):**
పట్టణ పరిధిలోని గోవిందాపురంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన రెంటాల సోమయ్య కుటుంబాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంటాల సోమయ్య ఆశయాలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు పి.పి పల్లె నాగేశ్వరరావు, సూర్యాపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డాక్టర్ కందుల గోవింద్, మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు, ఇట్టిమల్ల బెంజిమెన్, ఇట్టిమల్ల శ్రీను, రాంబాబు, వినోద్, విమన్ పాల్గొన్నారు.

## నేడే గురుకుల ప్రవేశ పరీక్ష

దేవరకొండ, ఫిబ్రవరి 22(జనం సాక్షి )
తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండ లో %ఱ+జజు%-2025.(5,6,7,8,9తరగతులకు అర్హత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలిపారు.నేడు ఆదివారం సమయం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు పరీక్ష ఉంటుందని, కావున విద్యార్థినీ, విద్యార్థులు 10 గంటల వరకు హాల్ టికెట్, ఆధార్ కార్డు ఒక ఫోటో తీసుకుని పరీక్షకు హాజరు కావాలన్నారు.11:10 నిమిషాలకు గేట్లు మూసి వేయనున్నట్లు పేర్కొన్నారు.పరీక్ష రాసే విద్యార్థినీ విద్యార్థులు సమయపాలన




పాటించి సెంటర్ కు హాజరు కావాలని తెలిపారు.

# ఏళ్ల నాటి వృక్షం పై గొడ్డలి వేటు



**నాగార్జునసాగర్,ఫిబ్రవరి 22(జనంసాక్షి):** పచ్చని చెట్లుప్రగతికి మెట్లు అని ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉంటే ఒక ప్రభుత్వ అధికారే దశాబ్దాల కాలం నాటి భారీ వృక్షాన్ని నేలమట్టం చేయడం స్థానికంగా ఉన్న పర్యావరణ ప్రేమికులను బాధించింది .నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఆఫీసర్స్ క్లబ్ లో ఉన్న దశాబ్దాల కాలం నాటి వృక్షం నేలమట్టమయింది ఎన్నో ఏళ్లకాలం నాటి చెట్టు ఆనవాళ్లను కోల్పోయింది కాలని వాసులకు స్వచ్ఛమైన గాలిని నీడను అందించే దశాబ్దాల కాలం నాటి వృక్షం ఇప్పుడు ఒక అధికారి నిర్లక్ష్యం కారణంగా నేలకొరిగింది. వివరాల్లోకి వెళితే స్థానిక మాజీ వైస్ చైర్మన్ మందా రఘువీర్ తెలిపిన వివరాల ప్రకారం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఏఈగా పనిచేస్తున్న నరసింహమూర్తి ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నుంచి ఉన్న ఈ చెట్టును నరికి వేశారని ఎందుకు దానికి నరుకుతున్నారని అడిగితే తాము ఆడుకుంటుంటే అడ్డు వస్తుందన్న ఉద్దేశంతోటి నరికి వేస్తున్నట్లు సమాధానం చెప్పాడని అన్నారు. దశాబ్దాల కాలంగా ఎంతోమంది ఏ ఈ లు, డి ఇ లు, ఎస్సీలు, ఈ క్లబ్బుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ దశాబ్దాల కాలంగా ఎవరికి అడ్డురా నీ వృక్షం నీకెలా అడ్డమొచ్చిందని ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అన్నారు. భారీ వృక్షాన్ని తొలగించాలంటే అటవీ శాఖ అనుమతి తప్పనిసరి. అటవీశాఖ అనుమతి లేకుండా వృక్షాన్ని తొలగించటం నేరమని చెప్పినా కూడా వినకుండా దాన్ని తొలగించడం జరిగిందని అన్నారు. దీనితో మాజీ వైస్ చైర్మన్ అతనిపై చర్య తీసుకోవాలని అటవీ శాఖకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని ఈ ఫిర్యాదును పరిగణలోనికి తీసుకొని అటవీశాఖ తప్పకుండా అతనిపై చర్య తీసుకుంటుందని హామీ ఇచ్చినట్లు ఆయన అన్నారు.

# బీసీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

## తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యమ నేత,మాజీ డిసిఎంఎస్ చైర్మన్ : వట్టే జానయ్య యాదవ్



**నలగొండ టౌన్,ఫిబ్రవరి22,జనం సాక్షి** ఈనెల 27 తారీకున జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మొదటి, రెండవ ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర బిసి ఉద్యమ నేత,మాజీ డీసీఎంస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్ అన్నారు.శనివారం నల్లగొండలోని యాదవ భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్,ఖమ్మం,నల్గొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులతో పాటు,తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ బీసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీల ఉపాధ్యాయులందరూ సమాజంలో మార్పును కోరే దిశలో ఉన్న,మీరు రాబోయే తరాల బీసీ సమాజానికి మార్గదర్శులు కావాలని కోరారు.75 సంవత్సరాలుగా బీసీలు ఏ విధంగా నష్ట పోయారో అందరికి తెలుసునని, ఇప్పుడున్న తరుణంలో ప్రతి ఒక్క పార్టీ కూడా బీసీల ఉద్యమాలతో నడుస్తున్నదని, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలలో 26 వేలు పైగా ఓట్లలో 20 వేల పైగా బీసీ ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ మేధావులైన మీరు,భావితరాలను తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉన్నదని,మీ మొదటి,రెండవ ప్రాధాన్యత ను ఇచ్చి మన బీసీ అభ్యర్థులకు గెలిపించే బాధ్యత మీదేనని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం బీసీలలో చైతన్యంను గ్రహించి,మళ్లీ రీ సర్వేను చేపట్టారని,బీసీల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నన్నారు.ప్రస్తుత తరుణంలో రాష్ట్రం లో ఎక్కడ చూసినా బీసీ వాదం వినిపిస్తుందని, బీసీలందరూ ఏకమైయ్యారని అన్ని రాజకీయ పార్టీలు గ్రహించాయన్నారు. ఉపాధ్యాయులు మా ఓట్లు మేము వేసుకుంటామనే ఐక్యత తీసుకొస్తున్నారని వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలన్నారు.ఈ మూడు ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులు గెలిస్తే బీసీలకు రాజ్యాధికారం చేపట్టే శక్తి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మి నారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు యాదవ్,యాదవ విద్య వంతుల వేదిక జిల్లా అధ్యక్షులు బెల్లి నాగరాజు,బి సి యువజన అధ్యక్షులు మునస ప్రసన్న కుమార్,యాదవ విద్య వంతుల జిల్లా ఉపాధ్యక్షులు అల్లి సతీష్ యాదవ్,జిల్లా అధికార ప్రతినిధి పుట్ట వెంకన్న గౌడ్,యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెబోయిన సతీష్,కేశబోయిన మల్లయ్య యాదవ్,వల్లాల సైదులు, జానపాటి శంకర్,మొదాల శ్రీనివాస్ యాదవ్,సుంకరబోయిన శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బేటి బచావో బేటి పడావో పై విద్యార్థులకు అవగాహన

**చింతపల్లి, ఫిబ్రవరి 22(జనంసాక్షి)** చింతపల్లి మండల కేంద్రంలో కేజీబివి పాఠశాలలో శనివారం ఐసిడిఎస్ ఆద్వర్యంలో విద్యార్థులకు బేటి బచావో బేటి పడావో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా వెల్ఫేర్ అధికారి (డి డబ్ల్యు ఓ) కృష్ణవేణి హాజరయ్యారు... ఆమె మాట్లాడుతూ బాలికల నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎలా తీసుకోవాలో తగు జాగ్రత్తలు తెలియచేశారు. "బేటి బచావో బేటి పడావో" లో భాగంగా గుడ్ యూనివర్స్ ఎన్జీవో శానిటరీ నాప్కిన్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దారు రమాకాంత్ శర్మ, మండల అభివృద్ధి అధికారి సుజాత, సిడిపిఓ సక్కుబాయి, మండల వైద్యాధికారి శ్రీదేవి, మండల విద్యాధికారి నీరుడు అంజయ్య, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఐసిడిఎస్ సిడిపిఓ సక్కుబాయి, కేజీబీవీ ఎస్ఓ వాసవి, సూపర్వైజర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# ప్రాణం తీసిన పంచాయతీ..



**నిడమనూర్ జనం సాక్షి** మండలంలోని కుంటి గొర్లగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఎల్లయ్య (60) ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంటిగొర్ల ఎల్లయ్య మరికొందరు గత కొంతకాలంగా వేంపాడు శివారులోని మేరెడ్డి వంశివర్ధన్ రెడ్డి వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని గొర్రెలను మేపుతున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో అతని సొంత గ్రామంలో ఓ మహిళతో ఘర్షణ నెలకొన్న సందర్భంగా ఆ మహిళ దుర్భాషలాడిందని మనస్థాపానికి గురైన ఎల్లయ్య గొర్రెలను మేపే ఆవరణంలో వేప చెట్టుకు చీర గుడ్డతో ఉరి వేసుకుని మృతి చెందాడని మృతుని కుమారుడు కుంటిగొర్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

# టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో 24న జర్నలిస్టుల నిరసన

## సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు ఎండీ ఆయూబ్ తెలిపారు. స్థానికంగా శనివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీ. వెంకన్న,మనోజ్ లతో పాటు ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24న కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమానికి జర్నలిస్టులంతా హాజరుకావాలని కోరారు. జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న,మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. దీంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 24న జరిగే చలో కలెక్టరేట్ కు జిల్లా నుండి జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఖాజా హమీదోద్దీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, మనోజ్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు మహేష్, జిల్లా నాయకులు ఖాజా నాజిమోద్దీన్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మంద సైదులు, జయరాజు, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# మిర్చి క్వింటాలకు 25000 మద్దతు ధర ఇవ్వాలి

**హుజూర్ నగర్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** మిర్చి క్వింటాలకు 25000 మద్దతు ధర ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు ఎల్లావుల రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డిఓ శ్రీనివాసులుకి మిర్చి క్వింటాల్కు 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెమోరాడం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన మిర్చి రైతులను ఆదుకోవాలని వారన్నారు. మిర్చి పంట పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని ఎకరాకు 1,80,000 నుండి రెండు లక్షల వరకు ఖర్చు వస్తుందన్నారు. దిగుబడి మాత్రం 10, 12 క్వింటాల్ మాత్రమే వస్తుందని, మిర్చి మార్కెట్లో ధర పది నుంచి 12000 మాత్రమే పలుకుతుందని దానివల్ల రైతులు పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే వరికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచిస్తుంటాయి. తీరా పంట వచ్చేనాటికి వాటికి మార్కెట్లో గిట్టుబాటు ధర రావటం లేదు. ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారన్నారు. ఇప్పటికే రైతాంగం పీకల్లోతులో అప్పులోకి కూరుకుపోయిందని, మిర్చి రైతులందరూ కూడ ఎక్కువ శాతం కౌలుదారులని, వారు పెట్టుబడులకు బయట ప్రైవేటు అప్పులు తీసుకొచ్చి పంటలు చేశారని, వారిని తక్షణమే ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మామిడి నరసయ్య, జక్కుల రమేష్, జడ వెంకన్న, ఎల్లావుల రమేష్, కుడి తొట్టిస్వామి, బంటు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

**రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటి సభ్యులు పొన్న ఉప్పలయ్య**

**రామన్నపేట, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** రజక వృత్తిదారుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించి సంక్షేమ పథకాల్లో రజకులకు ప్రాదాన్యత కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటి సభ్యుడు పొన్న ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మునిపంపుల గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన రజక వృత్తిదారుల రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించి ఇల్లు లేని రజకులందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. రజక వృత్తి దారులకు మోడరన్ సాంకేతిక వృత్తి పరికరాలు ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రజక వృత్తిదారులు సిరిసినగండ్ల నరసింహ, దావనూరి పిచ్చయ్య,గంప పద్మ,సిరిసనగండ్ల నర్సమ్మ,దామెర వంశీ, బాసవాడ ఎలందర్, పొన్న అండాలు,పొన్న సాయమ్మ,గంప వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు?

**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 22(జనం సాక్షి):** భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు? ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ బి.సురేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హరి ప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు, నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న విద్యార్థుల మనస్తత్వాలను జాగృతి పరిచే దిశగా సెలబ్రేషన్స్ నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కళలో విద్యార్థులు సాధించిన విజయాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తులసి, వెంకటేశ్వర్లు, శివశంకర్, సాయి వర్ధన్, వెంకటేశం, సంతోష్ కుమార్, వెంకట్ రెడ్డి, చందన, శ్రీదేవి, మంజుల, ఫర్విన్ మరియు అధ్యాపకేతర బృందం యూడిసి ప్రవీణ్ కుమార్, రాజేష్, లక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టిల హైస్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**వివిధ వేషధారణలో పలువురిని ఆకట్టుకున్న విద్యార్థులు**



**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 22 (జనం సాక్షి)** కొండామల్లేపల్లి మండల కేంద్రంలోని మాటిల్ల హై స్కూల్ లో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వేషధారణలలో విధులు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొహ్మమ్మద్ ఉస్మాన్ ఖాన్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండే విద్యార్థులకు పాఠ్యాంశాలను బట్టి పట్టించడం కాకుండా,సామాజిక బాధ్యతలను నేర్పించాలని తమ పాఠశాలలో సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు,సమాజానికి, మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలాని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ కొత్త తండా గ్రామంలో రివర్స్ ఆస్మాసిస్ నీటి శుద్ధి యంత్రాల ఏర్పాటు

**పాలకవీడు (జనంసాక్షి):** డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం ఆధ్వర్వంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ యన్.శ్రీనివాస రాజు,చీఫ్ జనరల్ మేనజర్ యస్. నాగమల్లేశ్వర రావ్ పర్యవేక్షణలో,ప్రజారోగ్య మౌలిక వసతుల రూపకల్పనలో భాగంగా మండలం లోని కొత్తతండ గ్రామమలో సుమారు 7లక్షల వ్యయంతో, రివర్స్ ఆస్మాసిస్ నీటి శుద్ధి కేంద్రాని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో డెక్కన్ సిమెంట్స్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షిత మంచి నీరు అందరికి, అందుబాటులో ఉంటుందని,దీని వల్ల ప్రజలు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని, ముఖ్యంగా పిల్లలు వృద్ధులు అనారోగ్యాల భారిన పడకుండా కాపాడుకోగలుగుతామని వివరిస్తూ,ఆరోగ్యంగా ఉండే పల్లెలు మాత్రమే దేశ అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.ప్రజా ప్రాయోజిత కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు డెక్కన్ సిమెంట్స్ కర్మాగార యాజమాన్యానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియచేశారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి..



**నేరేడుచర్ల (జనంసాక్షి):** వాతావరణంలో వేడి ప్రతి సంవత్సరం కూడా ఎక్కువ కావటానికి ముఖ్య కారణం ప్లాస్టిక్ వినియోగం,మొక్కలు పెంచకపోవడం ఇలాగే కొనసాగుతూ ఉంటే కొన్ని సంవత్సరాల తర్వాత మన భావితరాల వారికి ఆరోగ్యానికి బదులు అనారోగ్యాన్నీ అందించిన వారమవుతాం, ప్రతి ఒక్కరూ వారసత్వంగా ఆస్తులు అంతస్తులు ఇవ్వటానికి తొందర పడుతున్నారు కానీ మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలి నేటి సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచాలి అంటే పచ్చని చెట్లని నాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడుతూ మంచి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవాలి ఇంపాక్ట్ క్లబ్ మోటివేషనల్ ట్రైనర్ వీరవెల్లి శ్రీలత, గ్రీన్ క్లబ్ సెక్రటరీ తోట కిరణ్ ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆక్సిజన్ కోసం ఆక్సిజన్ సిలిండర్లను వాడవల్సి ఉంటుంది. ఇప్పటికైనా సమాజలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, మొక్కలను పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిందిగా గ్రీన్ క్లబ్ వారు అవేర్నెస్ తీసుకువస్తున్నారు.గ్రీన్ క్లబ్ జనరల్ సెక్రటరీ తోట కిరణ్ అలేఖ్య దంపతులు, తోట సత్యనారాయణ నాగమణి,గ్రీన్ క్లబ్ సభ్యులు, తెడ్ల ఉషారాణి, ఆగిరి కళ్యాణి, ఇమ్మడి వెంకటేశ్వర ప్రసాద్,పాల్గొన్నారు.

# వినియోగదారుల మన్ననలు పొందాలి





**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** నాణ్యమైన వస్తు సేవలను అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టిపిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరిఫ్ మెటల్ అండ్ ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. పెద్ద పెద్ద నగరాలకు ధీటుగా సూర్యాపేట అభివృద్ధి చెందుతూ అనేక రకాల వ్యాపారాలకు నిలయంగా మారిందన్నారు. అన్ని రకాల వ్యాపారాలకు విశేష ఆదరణ లభిస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆరిఫ్ మెటల్ అండ్ ఫ్యాబ్రికేషన్ వర్క్ వారు కూడా వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వినియోగ దారుల నమ్మకాన్ని పొందినప్పుడే ఏ వ్యాపారమైన వృద్ధి చెందుతుందని అన్నారు. లాభాపేక్ష లేకుండా సమాజ సేవ చేసే వ్యక్తి ఆరిఫ్ అని అన్నారు. అనంతరం నిర్వాహకులు ఎండీ. ఆరిపుద్దీన్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధునాతన టెక్నాలజీతో తాము అందించే మెటల్ అండ్ ఫ్యాబ్రికేషన్స్ వర్క్ ను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, నాయకులు వెంకటరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సునీల్ రెడ్డి, పొలగాని బాలు గౌడ్, పందిరి మల్లేష్, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ, దివ్య, ప్రొప్రైటర్ ఎండీ. ఆరిపుద్దీన్, షేక్ అహ్మద్ అలీ, మీరా భాష, కమరుద్దీన్, రిటైర్డ్ ఎస్ఐ అబ్దుల్లా, హజీమ్, బాబా, ఆసిఫ్, అబ్దుల్, లతీఫ్, మునిఫ్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఎస్ లో రెడ్ కలర్ డే వేడుకలు

దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యార్థులు రెడ్ కలర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రెడ్ కలర్ దుస్తులు ధరించి పలువురిని ఆకట్టుకున్నారు. రంగుల ఆనందాన్ని జరుపుకోవడానికి ప్రతి నెలా రంగుల దినోత్సవాన్ని జరుపుకుంటామని కరస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి @ దేవరకొండ

## మాజీ సర్పంచ్ శ్రీరాములు కొడుకును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

**ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పవన్**



**మర్రిగూడ, ఫిబ్రవరి 21, ( జనంసాక్షి)** మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీరాములు కుమారుడు ఎడ్ల పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పవన్ ప్రస్తుతం హైదరాబాద్ బియన్ రెడ్డి నగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యుడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఎడ్ల శ్రీరాములు ను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చాడు. భగవంతుడి దయవల్ల పవన్ ఆరోగ్యం కుదుటపడుతున్నదని ఎలాంటి ఆందోళన చెందవద్దని శ్రీరాముల కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చాడు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మెందు మోహన్ రెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, సహకార సంఘం చైర్మన్ బాల నరసింహ, సీనియర్ నాయకుడు రామిడి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ పూరిపక్క సరితానగేష్, మాజీ సర్పంచులు చెరుకు లింగం గౌడ్, లక్ష్మీనరసింహ గౌడ్, మొలిగిరెడ్డి గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

## కొనసాగుతున్న హజ్రత్ అబ్బాస్ దర్గా ఉర్సు ఉత్సవాలు

**దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భీల్యా నాయక్**



**చింతపల్లి, ఫిబ్రవరి 22(జనంసాక్షి):** చింతపల్లి మండలం పీకేమల్లేపల్లిలో హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు ఉత్సవాలలో పాల్గొన్నా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యా నాయక్ హాజరై దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు పూజలు చేశారు. కేతావత్ భీల్యా నాయక్ ని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉర్సు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పాల్గొంటారని ఈ దర్గా ఎంతో ప్రాముఖ్యత తో కుడుకున్నది అని ఆ హల్లా ఆశీస్సులు అందరి పై ఉండాలని అన్నారు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని రకాల ఏర్పాటు చేసి వారికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో దర్గా కమిటి చైర్మన్ కే.వి రమేష్, చాంద్ పాషా, సయ్యద్ పాష, యుసుప్ పాష, షరిప్, అబి , జైపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్న కుటుంబాన్ని పరామర్శించిన ప్రజా ప్రతినిధులు

**కనగల్లు, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** పగిడిమర్రి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ ఆయుధ గోని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వెంకన్న మృతి చెందిన విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి మాజీ సర్పంచ్ గోలి జగాల్ రెడ్డి తీసుకెళ్లగా దిగ్భ్రాంతికి గురై అతని కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం 50 వేల రూపాయలను పంపించారు. ఇట్టి ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ లు గోలి నర్సిరెడ్డి, ఇడికూళ్ళ రవీందర్, సుంకి రె డ్డి కృష్ణారెడ్డిలు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకిరెడ్డి కేశవరెడ్డి, ఆయుధగోని యాదయ్య, పల్లెబోయిన నరసింహ, సైదులు మందడి శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సైదులు, సురేష్, రమేష్, శ్రీను, మహేష్, పవన్, గణేష్, రాజా, పెరిక వెంకన్న తదితరులు ఉన్నారు.

## ఆక్స్ఫర్డ్ పాఠశాల లో కవలల దినోత్సవం



**చిట్యాల ఫిబ్రవరి 22(జనం సాక్షి)** జాతీయ కవలల దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలోని ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్కూల్ లోని కవల పిల్లలకు సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ పెద్ది నరేందర్ జ్ఞాపికగా కథల పుస్తకాలను, మిఠాయిలను అందజేశారు. కవలలను అభినందించిన వారిలో ఉపాధ్యాయ బృందం బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,నమ్ముల ఆనందకుమార్, పెద్ది పద్మ, షేక్ షమీమున్నీసాబేగం, ఎం ధనలక్ష్మి, ఎస్ జ్యోతి, పి స్వాతి, పి రమాదేవి, ఎం మాధవి, జూబీదా, కే మౌనిక, సిహెచ్ ప్రసన్న, ఎస్ కీర్తి, బి కన్నయ్య, ఆసియా, బి స్వప్న, జై శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బంజారా సంస్కృతి ఔనత్యాన్ని చాటి చెప్పిన ఆదర్శమూర్తి శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్..

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి..**

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** దామరచర్ల మండలం పరిధిలోని జిలకరకుంట తండాలో నిర్వహించిన గిరిజన ఆరాధ్య దైవం సద్గురు శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం నాడు ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్కైలాభ్ నాయక్ మరియు గ్రామస్థులతో కలసి సేవాలాల్ మహారాజ్ కి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.







## ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 22 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చీన్యా అధ్యక్షతన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ జక్కం లోకేష్ విశిష్ట అతిథిగా జి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు రవీలా దేవి, గర్ల్స్ హెచ్ఎం బి.వి వెంకటేశ్వర్లు, బంజార్ హెచ్ఎం ఆదినారాయణ, మోహన్ హాజరై విద్యార్థులకు పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత పొంది కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆదర్శవంతంగా ఉంటూ అందరి మన్ననలను పొందాలన్నారు. విద్యార్థులు పై చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మనం ధనానికి పేదవాళ్ళం గానీ విద్య కు పేదవాళ్లం కాదని, ఎన్నటికీ తరగని గని విద్య అని, చక్కగా విద్యను అభ్యసించి మీ తల్లిదండ్రులకు మీకు విద్య నేర్పిన కళాశాల అధ్యాపకులకు మంచి పేరు తేవాలని పలు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## దశ దిన కర్మకు 10,000 రూపాయలు వితరణ

**కల్లూరు ఫిబ్రవరి 22 (జనంసాక్షి)**



మండల పరిధి యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన కటుకూరి తిరుపమ్మ ఇటీవల మృతి చెందినారు. ఆమె దశ దిన ఖర్మ కు ఖర్చులనిమిత్తం అదే గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీరవల్లి శ్రీనివాసరావు కల్లూరు మాజీ యం పీ పీ బీరవల్లి రఘు లు కలసి రూ,10000 వేల రూపాయలు గ్రామ ప్రజలు సమక్షంలో ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు శనివారంఅందజేశారు. గ్రామ ప్రజలు బీరవల్లి బ్రదర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టీ వీ ఆర్ నరసింహారావు, బీరవల్లి కృష్ణ, సాతునూరి శ్రీనివాసరావు, కటుకూరి వెంకటేశ్వర్లు, బీరవల్లి వెంకటనారాయణ, వాడపల్లి లాలు, దామాల వెంకటేశ్వర్లు, బీరవల్లి మోహన్ రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 4రోజుల్లోనే అత్తా, కోడలు మృతి

### ఇరువురు క్యాన్సర్ తో మృతి చెందడంతో కన్నీటి సంద్రమైన కుటుంబ సభ్యులు

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)**





ఖమ్మం రూరల్ మండలం పోలిశెట్టి గూడెం గ్రామపంచాయతీలోని మద్దివారిగూడెంలో నాలుగు రోజుల వ్యవధిలోనే అత్త కోడలు చనిపోవడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. తొలుత అత్త చిక్కుల వెంకటమ్మ (60) క్యాన్సర్ తో బాధపడుతూ గురువారం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సరిగ్గా ఆమె మృతి చెందిన నాలుగు రోజులకు తన పెద్ద కుమారుడి భార్య(కోడలు) చిక్కుళ్ళ కృష్ణవేణి(40) మృతి చెందింది. ఈమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.వీరిద్దరూ క్యాన్సర్ తో రోజుల వ్యవధిలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెంపటి రాము తదితరులు ఉన్నారు.

## ఎన్ఎస్పీ నీరును రైతులు సద్వినియోగపరుచుకోవాలి



చింతకాని మండల ఎన్ఎస్పి ఆయకట్టు పరిధిలోని పంటలను పరిశీలించిన సహాయ వ్యవసాయ సంచాలకులు మధిర ఎస్ విజయ్ చంద్ర

రైతులకు సూచనలు సలహాలు ఇచ్చిన మండల వ్యవసాయ అధికారి ఎస్ మానస

**చింతకాని, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):**
చింతకాని మండల పరిధిలోని నాగిలిగొండ ప్రొద్దుటూరు నేరడ తిమ్మినేనిపాలెం గ్రామాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు మధిర ఎస్ విజయ్ చంద్ర ఎన్ఎస్పి ఆయకట్టు పరిధిలోని పంటలను పరిశీలించారు. రైతులకు ఎన్ఎస్పీ వారబందీ పద్ధతిలో ఇచ్చే షెడ్యూల్ ను , ఆయకట్టు పరిధిలోని గల రైతులు అందరు కూడా ఎన్ఎస్పీ నీరు ను సరిగా వినియోగించుకోగలరని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పి ఏఈ సందీప్ , మండల వ్యవసాయ అధికారి ఎస్ మానస వ్యవసాయ విస్తరణ అధికారులు రాము, తేజ రైతులు పాల్గొన్నారు.

## నేడు గురుకుల పాఠశాలలో ఎంట్రన్స్ టెస్ట్

**కల్లూరు ఫిబ్రవరి 22 (జనంసాక్షి):**



2025 విద్యా సంవత్సరానికి గాను 5 తరగతిలో ప్రవేశానికి మరియు 6,7,8,9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించి కల్లూరు లోని గురుకుల పాఠశాల కేంద్రంలో 23వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంట్రన్స్ టెస్ట్ జరుగుతుందని పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్" కోసం హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్స్ తో పాటు ఆధార్ కార్డు తీసుకొని రావాలని పేర్కొన్నారు ఎంట్రన్స్ పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని తెలియజేశారు. విద్యార్థులు ఆదివారం ఉదయం 10:00 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నరు.



## స్పందన జూనియర్ కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
స్పందన జూనియర్ కళాశాల పట్టణంలోని స్పందన జూనియర్ కళాశాలలో ఫేర్వెల్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎడవల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ మార్చ్ 5 నుంచి జరగబోయే ఇంటర్ వార్షిక ఫలితాలకు విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పలు సినీ పాటలకు, గేయాలకు కళాశాల విద్యార్థిని విద్యార్థులు వేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. అనంతరం రాష్ట్రస్థాయిలో ఎంపీసీలో భాగంలో466/470 రెండవ ర్యాంక్ స్థానం సాధించిన కళాశాల విద్యార్థిని బండ పూజిత అభినందించి మెమెంటో అందజేశారు .ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్ట ప్రవీణ్ రెడ్డి అధ్యాపకులు సతీష్ ,శ్రీధర్ , శ్రీనివాస చారి, లింగారెడ్డి , శ్రీను, నగేష్, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ ప్రభాకర్, సైదిరెడ్డి ,ఆంజనేయులు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

## నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలకే మళ్లీ పట్టం

- కష్టానికి తగిన ఫలితం
- మరోసారి నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలుగా బర్ల నాగమణి



**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 22 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- కాంగ్రెస్ అధిష్టానం మరోసారి పినపాక నియోజక వర్గం బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలుగా బర్ల నాగమణి ని నియమించినట్లుగా ఆ పార్టీ జాతీయ మహిళా అధ్యక్షురాలు అల కలంబ ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు ప్రకటించారు. ఈ మేరకు శనివారం హైదరాబాదులోని గాంధీభవన్లో నియామక పత్రాన్ని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతా రావు చేతుల మీదుగా అందుకున్నారు. కష్టానికి తగిన ఫలితం పొందడం పట్ల ఆమె అభిమానులు కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పట్ల విధేయతగా పనిచేశానని అధికారంలోకి వచ్చినప్పుడు అదే విధంగా పార్టీ అభివృద్ధికి కృషి చేశానని, తన కష్టానికి ప్రతిఫలంగా మరోసారి నాకు పదవి అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అలకలాంబ కు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత రావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ పట్ల ఎప్పుడు విధేయతగా ఉంటానని ఆమె అన్నారు. తన వెన్నంటే ఉంటూ నియోజకవర్గంలో మహిళా సభ్యత్వాలు అధికంగా చేసేందుకు తోడ్పాటు అందించిన జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు చేరే విధంగా ఇంటింటికి అందే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పని చేస్తానని అన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలు



**పి.ఏ.పల్లి,ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** పి.ఏ.పల్లి బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 256 వ జయంతి ఉత్సవాలు శనివారం బంజారా సేవా సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి,మాత మేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కృషి చేసిన వారిలో సంతు సేవాలాల్ మహారాజ్ ఒకరన్నారు.ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు బోడియ్య నాయక్,కార్యదర్శి రామచంద్ర నాయక్, మాజీ ఎంపిటిసి నారాయణ, గాసిరాం నాయక్,మాజీ సర్పంచ్ లచ్చిరాం, పాండు నాయక్,చంద్రు నాయక్, సీతారాం, భీమా నాయక్,యువ నేత లక్ష్మణ్ నాయక్,బాలకృష్ణ,రాము నాయక్, శ్రీరామ్, లక్ష్మణ్ నాయక్,దస్రు నాయక్,రఘు, రాజా, ఇస్లావత్ రాజు నాయక్, మోహన్, రమేష్ నాయక్, శ్రీకాంత్ నాయక్,కృష్ణ నాయక్,నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పినాకిల్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ సమావేశం



**నేరేడుచర్ల (జనంసాక్షి ) :**
పట్టణంలోని పినాకిల్ పాఠశాలలో వసుదైక కుటుంబం మాది, జగమంతా కుటుంబం మాది మరియు గ్రాండ్ పేరెంట్స్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.నేటి బంధుత్వాలు నేడు తెగిన గాలిపటాలు భేషజాల సుడి గాలికి కొట్టుకు పోతున్న కాగితాలు ఆర్థిక సంబంధాల అడకత్తెరలో ముక్కలౌతున్న పోకచెక్కలుగా మారాయి.అందుకే హృదయంతో స్పందించి, మనసులో మదించి, ఆలోచనల అగ్ని కణం రగిలించి అక్షర లక్షలతో ముందుకు సాగుతున్నది పినాకిల్ పాఠశాల ఈ సందర్భంగా పినాకిల్ విద్యా సంస్థల అధినేత మదార్ సార్ మాట్లాడుతూ.అనుబంధాల లోగిలి, రక్త సంబంధాల వాకిలి, ప్రేమాను రాగాల కౌగిలి మరియు మానవత్వానికి మనిషి జీవితానికి పేగుబంధానికి ప్రేమానురాగాలకి రక్తబంధానికి నిదర్శనం మన బంధుత్వాలు, కుటుంబ వ్యవస్థ రోజు రోజుకు నశించిపోతుందని అన్నారు. అందుకే రోజు రోజుకు ఓల్డ్ ఏజ్ హెూం ల సంఖ్యలు పెరుగుతూ పోతున్నాయని, బాల్యం నుండే మార్పు రావాలి,బందాలు పెరగాలి, అమ్మమ్మ, నానమ్మ ల కథలు వినాలి, తాతయ్య నేర్పే మర్యాదలు నేర్పాలి,కుటుంబంలో ఉండే ఆనందం తెలపాలి, అది మనింటినుండే ప్రారంభం కావాలి, కలసి బోజనం చేసి, కలసి ముచ్చటించడం నేర్పాలి,ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడాలన్నారు.అలాగే విద్యార్థి, విద్యార్థులు తమ ప్రతిభ తో సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. అనంతరం తమ అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలను తము ఘనంగా సత్కరించారు.ఈ వసుదైక కుటుంబం కార్యక్రమంతో మళ్ళీ ప్రపంచానికి మన దేశం వసుదైక కుటుంబం అని చాటి చెబుదాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, శ్రేయోభిలాషులు, పురప్రముఖులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు సొమ్ము దొంగిలించిన ముగ్గురు నిందితులు రిమాండ్

**కోదాడ,జనంసాక్షి:**రైతు సొమ్మును దొంగలించిన ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకుని రిమాండ్ కు తరలించారు.కోదాడ రూరల్ సిఐ రజిత రెడ్డి శనివారం పట్టణంలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.ఈనెల 18వ తారీఖున అనంతగిరి మండలం గొండ్రియల గ్రామానికి చెందిన రైతు కొండ బాల పుల్లయ్య ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వెళ్లి తాను అమ్మిన వరి ధాన్యం సంబంధించి డబ్బులను తీసుకొని తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో వద్దకు వచ్చేసరికి తన వెనకనే ఒక స్కూటీపై ముగ్గురు వ్యక్తులు వచ్చి పుల్లయ్యను కొట్టి కింద పడేసి అతని వద్ద ఉన్న డబ్బులను లాక్కొని పారిపోయారు.ఈ విషయమై రైతు పుల్లయ్య ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.పూర్తిస్థాయిలో విచారణ చేయ వలసిందిగా సంబంధిత ఎస్సై నవీన్ కుమార్ కు ఆదేశాలు జారీ చేయడం తో ఎస్సై తన సిబ్బంది వీరబాబు ఏడుకొండలు,నరసింహులు తో కలిసి చాకచక్యంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉపతల అశోక్ కుమార్ ,షేక్ నవాబ్, షరీఫ్ దేవల్లా రాజా ముగ్గురు నిందితులను సిసి ఫుటేజ్ ఆధారంగా పట్టుకొని వారి వద్ద నుండి నగదు లక్ష 70 వేల రూపాయలు ద్విచక్ర వాహనం రెండు సెల్ ఫోన్ ను స్వాధీన పరుచు కున్నట్లుగా సీఐ తెలిపారు.నిందితులలో మొదటి వ్యక్తి ఒక గంజాయి, మూడు దొంగతనాలు,రెండు హత్య ప్రయత్నం నేరాలు,రెండవ నిందితుడు పై ఒక గంజాయి ,దొంగతనం కేసు, మూడవ నిందితుడు పై సైతం ఒక కేసు కలదని తెలిపారు.ఈ కేసు పరిశోధనలో చురుకుగా వ్యవహరించిన అధికారులకు ఉన్నతాధికారుల అభినందనలు తెలియజేశారు.

# ఉపాధ్యాయ అధ్యాపక గొంతుకగా మరోసారి అవకాశం ఇవ్వండి

◆బిడ్డ డెలివరీ కోసం విదేశాలకు వెళ్లడం తప్పా ◆విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి




మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 (జనం సాక్షి) ఉపాధ్యాయ అధ్యాపక గుర్తుగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఓటును అభ్యర్థించారు అనంతరం యూటీఎఫ్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జరిగే పోలింగ్లో సీరియల్ నెంబర్ నాలుగులో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 30% ఫిట్మెంటుతో పిఆర్సి సాధనలో కృషి ఉందని కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ పిఆర్సి ప్రకారం 30 శాతం వేతనాలు పెంచడానికి ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. ప్రమోషన్స్ కు టెట్ సమస్య ప్రధాన అడ్డంకిగా ఉన్న స్థితిలో ఢిల్లీకి వెళ్లి ఎన్సిటిఈ చైర్మన్, సెక్రటరీ తో మాట్లాడి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడటం వల్లనే బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ వేగంగా పూర్తి చేశామని, గిరిజన సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేయించానని తెలిపారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పిఆర్సి, సెలవులు మంజూరు, బదిలీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని ఐదు రకాల గురుకులాలలో బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ జారీ చేయించి పూర్తి చేయించినట్లు తెలిపారు కేజీబీవీ ఉపాధ్యాయులకు రెండుసార్లు జీతం పెంపు, మూడు సార్లు బదిలీలు ఎండాకాలం జీతం, ఆటో రెన్యువల్ ఎమ్మెల్సీ ఓటు హక్కు సాధించడంలో ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్స్ బదిలీలు కాంట్రాక్ట్ లెక్చర్ల సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషించినట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు కొరకు శాసనమండలిలో మాట్లాడానని బయట కూడా అనేక పోరాటాలు చేశానని చెప్పారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుండి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయుల అధ్యాపకులు, ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయించి ఓపీఎస్ అమలు చేయలా కృషి చేస్తానన్నారు. మండల, ఉప విద్యాధికారులు డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులలో ప్రమోషన్స్ అమలు చేయించాలని, ఐదు రకాల గురుకులాల సమయం మార్పిడి, హెల్త్ కార్డులు, డిప్యూటీ వార్డెన్ పోస్టుల మంజూరి, 0 1 0 ద్వారా జీతాల చెల్లింపు సమస్యను పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుకు 010 ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, ప్రమోషన్స్ ఇప్పించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు మంజూరి, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలని కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పండిట్ పీఈడి పోస్టుల అప్ గ్రేడేషన్, సిఆర్టి లకు మినిమం బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలన్నారు. జూనియర్ కళాశాలకు నిర్వహణ గ్రాంట్ మంజూరి ఇతర సమస్యల పరిష్కారానికి శాసనమండలు పోరాడుతారన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఏడవ కేంద్ర ప్రభుత్వ పిఆర్సి ఏరియాస్ ఇప్పించుటకు, యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయుటకు గ్రాండ్ పెరుగుదల, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చుటకు కృషి చేస్తానన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అధ్యాపకులకు పిఎఫ్ అమలు, హెల్త్ స్కీము రిటైర్మెంట్ సందర్భంలో ఎక్స్గ్రేషియా చెల్లింపు, అర్హులైన వారికి ప్రభుత్వ గృహ నిర్మాణంలో అవకాశం కల్పించేందుకు తమ వంతు పాత్ర పోషిస్తాన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగమణి , జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాస చారి , సీనియర్ నాయకులు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఏ. కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు మోర్తల శ్రీనివాస రెడ్డి ,చిన్న వెంకన్న, గుండా వేదశ్రీ, దాసరి ప్రభాకర్ వేములపల్లి అధ్యక్ష కార్యదర్శులు బైరం బాలరాజు, మాలోతు నాగేష్ నాయక్, మిర్యాలగూడ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు కోడి రెక్క జయరాజు, సాజిద్ అలీ, మండల ప్రధాన కార్యదర్శి పులి సత్యనారాయణ, సీనియర్ నాయకులు డి వెంకట్ రెడ్డి, దామరచర్ల అధ్యక్ష కార్యదర్శులు భూక్య శ్రీనివాసరావు, చెల్క పల్లి శ్యామ్ కుమార్ ,నిడమనూరు ప్రధాన కార్యదర్శి లింగంపల్లి అంజయ్య, త్రిపురారం అధ్యక్షులు కట్ల మధుసూదన్ పాల్గొన్నారు.



## మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఆహ్వానం

**రామన్నపేట, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):**
భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కి రామన్నపేట మండలంలోని నిధానపల్లి గ్రామంలో వెలసియున్న స్వయంభూ శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మాజీ సర్పంచ్ గుత్తా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఎంపీ చామల హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ ప్రతినిధులు ఎంపీ చామలను కోరారు.ఈ సందర్భంగా ఎంపీ బ్రహ్మోత్సవాల నిర్వహణకు శుభాకాంక్షలు తెలుపుతూ, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపను పొందాలని ఆకాంక్షించారు. ఆహ్వానం పలికిన వారు గుత్తా శ్రీనివాస్ రెడ్డి, కట్టగురి ప్రసాద్, బొడ్డుపల్లి సాలి, కొండ వెంకటేష్, పబ్బతి చింటూ గౌడ్, కడారి రాజశేఖర్, బొడ్డుపల్లి మహేష్ తదితరులు ఉన్నారు.

## పూల రవీందర్ ను గెలిపించండి



**నల్లగొండ టౌన్,ఫిబ్రవరి22,జనం సాక్షి**
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ కు బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ ఉపాధ్యాయులందరు మద్దతుగా నిలిచి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని,బీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్య గౌడ్ కోరారు.శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల27న జరిగే నల్లగొండ ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ ఎలక్షన్లో బహుజన వాదాన్ని వినిపించాలని,భవిష్యత్ తరాల కోసం బీసీల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేశపోయిన శంకర్, ముదిరాజ్ ఆర్థిక శాఖ కార్యదర్శి శ్యాంసుందర్,బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గోవర్ధన్,దాగిళ్ళ శ్యాంసుందర్, అంజయ్య,రాజపేట అజయ్, మామిడి సత్తయ్య,జేరిపోతుల శంకర్ గౌడ్,నకిరేకంటి లాలయ్య గౌడ్, వీరమల్ల నాగరాజు గౌడ్,జిల్లా ఆదినారాయణ, సురిగి యాదగిరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన కస్తూరి ఫౌండేషన్



**చిట్యాల ఫిబ్రవరి 22 (జనంసాక్షి)**
చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ వారు స్టడీ మెటీరియల్ ను ఎంఈఓ పానుగోతు సైదా నాయక్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో ఇష్టంతో స్టడీ మెటీరియల్ చదువుకొని పరీక్షకు సిద్ధం కావాలని అన్నారు స్టడీ మెటీరియల్ అందజేసిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, బాలకృష్ణ, బాలయ్య, నయిముద్దీన్, అష్రఫ్ అలీ,మాధవి,సాయిబాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్**



**పెన్ పహాడ్ ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాబోయే వార్షిక పరీక్షల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మండల నోడల్ ఆఫీసర్ ధరావత్ వస్రాం నాయక్ మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యార్థులు చదవాలని సూచించారు పాఠశాలకు మండలానికి వారి తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల ఆటపాటలు, నాటికలు, ఉపన్యాసాలు, ఆహ్వానితులను ఆకర్షింప చేశాయి, గత వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను శాలువా , మెమెంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నకుమారి, ఇమాంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బి.రమేష్, ఉపాధ్యాయులు,విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్లో వికలాంగులకు నిధులు పెంచాలి

**జిల్లా నాయకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి**

**కక్కిరేణిలో ఎన్ పి ఆర్ డి ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ**

**రామన్నపేట, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** ప్రభుత్వం వికలాంగులకు బడ్జెట్లో నిధులు పెంచి, వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంఘం జిల్లా నాయకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఎన్ పి ఆర్ డి 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందుతున్నాయని అన్నారు. పెన్షన్ పెంపుతో పాటు స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరిశ్రమలలో వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కేటాయించాలని కోరారు.ఫిబ్రవరి 21నుండి 27వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు వేముల సైదులు, చిరుమర్తి ఉదయ్, వికలాంగుల సంఘం గ్రామ అధ్యక్ష కార్యదర్శులు కన్నెబోయిన మంగమ్మ , చిల్ల రమాదేవి , భాషబోయిన పద్మ , భాషాని సత్తయ్య , యశోద ,గంగాధర్ రాములమ్మ , సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అప్పులు చేసైనా....గ్రామ సమస్యలను పరిష్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు..

**కార్యదర్శులపై తప్పుడు కథనాలు రాస్తున్న వారిని కచ్చితంగా శిక్షించాలి..**

**టీపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీపీఓకి వినతి పత్రం..**

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 22 (జనంసాక్షి)** గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను అప్పులు చేసి పరిష్కరిస్తున్నటువంటి పంచాయతీ కార్యదర్శులు, జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులపై తప్పుడు వార్తలు రాస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల మధు అన్నారు. ఈ సందర్భంగా టీపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నాడు డిపిఓ వెంకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల పంచాయతీ అధికారులతో కలెక్టర్ మీటింగ్ తీసుకోలేదని, గత ఫిబ్రవరి నుండి సర్పంచ్ లు లేకపోవడం, నిధుల లేమి ఉన్న కూడా గ్రామాలలో అత్యవసర పనులైన డ్రింకింగ్ వాటర్, చెత్త సేకరణ పనులు చేయిస్తూ అప్పులల్లో కూరుకొని ఉన్నామని, ఇందిరమ్మ ఇండ్లు లాంటి ప్రభుత్వ పథకాలను అమలుపరుస్తూ, అటు గ్రామ పంచాయతీలలో అత్యవసర పనులు చేయిస్తున్నామని, అలాంటి మాపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కోడిరెక్క శైలజ,కోశాధికారి నరేష్ యాదవ్, జాయింట్ సెక్రటరీ వెంకన్న,డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ,రమేష్, మహారాజ్,వాసుదేవ్,జానకిరాములు,జగదీష్,శ్రవణ్,సైదామియా,శ్రీకాంత్, వెంకటేశ్వర్లు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు....



# బచ్పన్ స్కూల్లో యాన్యువల్ డే వేడుకలు

**విద్యార్థుల కళా ప్రదర్శన అద్భుతం**

**పలువురిని ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు..**

దేవరకొండ,ఫిబ్రవరి 22(జనం సాక్షి) ఎంతోమంది విద్యార్థులను బచ్పన్ ప్లే స్కూల్, బచ్పన్ ఆక్స్ఫర్డ్ హై స్కూల్ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిందని మేనేజింగ్ డైరెక్టర్ గుద్దేటి జంగయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలో బచ్పన్ స్కూల్ ఆవరణలో 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ గుద్దేటి జంగయ్య, ప్రిన్సిపల్ బి నిచ్చల అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులతోడ్పాటు ఉంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి, వారితో విద్యాపరమైన సామాజిక అంశాలపై చర్చించడం ద్వారా వారిలో భయం పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ గుద్దేటి జంగయ్య, ప్రిన్సిపల్ బి నిచ్చల,ఇల్లేందుల శ్రవణ్ కుమార్,యచ్చ శ్రీనివాస్ , అలంపల్లి మురళి, పోలా శ్రీనివాసులు, వాస వెంకటేశ్వర్లు, మోర అశోక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# పూల రవీందర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

**బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు,మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు**

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు కోరారు.శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జీవివి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ నెల 27న జరుగబోయే శాసనమండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ కి బీసీ సంఘం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.ఈ ఎన్నికల్లో బీసీ వాదాన్ని గెలిపిస్తే భవిష్యత్తులో మంచి స్థానంలో బీసీలు ఉంటారని అన్నారు. బీసీలందరు ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తూ బీసీ వాదాన్ని గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూతం ఏకమల్లు, టిపిటియు రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు దశరథ రామారావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గాలి మురళి, బుల్లెద్దు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అనంతల వెంకటేశ్వర్లు, బీసీ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



చిట్యాల ఫిబ్రవరి 22(జనం సాక్షి) చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రీన్ గ్రోవ్ పాఠశాల లో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారారు పలువురు విద్యార్థులు రాష్ట్రపతిగా, ప్రధానమంత్రిగా, ఎంపీలుగా ముఖ్య మంత్రిగా ఎమ్మెల్యేలుగా ఉన్నత అధికారులుగా మారారు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపటానికి ఉపాధ్యాయులు ఏ విధంగా చేస్తున్నారని , ఉపాధ్యాయులు సమాజానికి మార్గ దర్శకుమని , సమాజం భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి, ఏవో పోల గోవర్ధన్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధ్యయనంతో ప్రపంచ పరిణామాల అంచనా

## సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే

**కారేపల్లి, ఫిబ్రవరి22(జనంసాక్షి) :** అధ్యయనంతో సమాజంలో జరుగుతున్న పరిణామా లను అంచనా వేయగల్గుతామని సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. శనివారం కారేపల్లి మండలం మాధారంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలలో చర్చించే రాజకీయ సమీక్ష నివేదికపై చర్చించారు. ఈసందర్బంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయంగా జరుగు తున్న పరిణామాలను ప్రతి కార్యకర్త తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రరాష్ట్రాలలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితం ప్రజలకు వివరించగలిగేది అధ్యయనం ద్వారానే అని అన్నారు. పాలకులు ప్రజలను మభ్యపుచ్చుటం, ఎన్నికలలో గెలుపుకు ప్రజలలో ఉద్రిక్తలు పెంచి




పబ్బంగడుపుకోవటం నిత్యకృత్యమైందన్నారు. పాలకుల దుశ్చర్యలను ప్రజలకు వివరించి చైతన్య శీలును చేయటమే కమ్యూనిస్టుల కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు తుమ్మోజు రామ్మూర్తి, గుర్రం వెంకన్న, పాపినేని నాగేశ్వరరావు, ఎర్రబెల్లి సతీష్, భాగం వెంకటప్పారావు, పొట్లకాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య సహకార సభ్యులు వశ్య మృతి

**కారేపల్లి, ఫిబ్రవరి 22 (జనంసాక్షి) :**



దుబ్బతండా గిరిజన మత్స్యశాఖ సహకార సభ్యులు మేకలతండాకు చెందిన భూక్యా వశ్య(63) శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న వశ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. గిరిజన మత్స్యసహకార సంఘం ఏర్పాటులో కీలక భూమిక పోషించిన వశ్యా 2011లో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంఘం ఆధ్వర్యంలో చెరువులలో చేపల పెంపకంను నిర్వహించి ఎందరికో ఆదాయవనరులు కల్పించారు. వశ్యా మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళ్లు అర్పించారు.

# గ్రామాల్లో కోతుల బెడద.. నగరాల్లో కుక్కల బాధ

◆పిల్లలు,మహిళలు, వృద్దులు స్వేచ్ఛగా వెళ్లలేని పరిస్థితి ◆చర్యలు తీసుకోవడంలో అధికారుల విఫలం





**హైదరాబాద్, ఫిబ్రవరి 22 (జనంసాక్షి):** గ్రామాల్లో కోతుల బెడద తీవ్ంగా ఉంది. పంటలను నాశనం చేస్తున్నాయి. ప్రజలమీద పడి రక్కుతున్నాయి. గ్రామాల్లో ప్రజలు తమ ఇంటిని ఓ జైలులాగా గ్రిల్స్‌తో నిర్మించుకుంటున్నారు. స్థానిక ఎన్నికల మడావిడిలో ఇప్పుడు చాలామంది కోతుల సమస్యను తెరపైకి తెస్తున్నారు. కోతుల నిర్మూలనకు ఏం చేస్తారో చెప్పాలని అడుగుతున్నారు. అయితే అటవీ అధికారులు మాత్రం ఇన్నేళ్లయినా కోతులను తరలించే చర్యలు చేపట్టలేదు. గతంలో కెసిఆర్ సిఎంగా ఉన్న సమయంలో కోతులు వాపస్ పోవాలని నినాదం ఇచ్చారు. ఆయన పోయారు తప్ప, కోతులు మాత్రం అక్కడే ఉన్నాయి. పాలకుల్లో చిత్తశుద్ది లేదనడానికి ఇదే నిదర్శనం. అలాగే రేవంత్ సర్కార్ కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఏనాడూ ఈ సమస్యపై కనీస విచారణ కూడా చేయలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం..తరవాత మిన్న కుండడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. అగ్రిప్రమాదాలు, బస్సుల ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, కాలువల్లో కొట్టుకు పోవడం, వీధికుక్కల బారిన పడడం వంటి అనకానేక ప్రమాదాల సందర్బంగా జరుగుతున్న తీరు ఇందుకు నిదర్శనంగా చూడాలి. ప్రమాదాలు జరగ్గానే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం, మళ్లీ మరచి పోవడం..జరుగుతోంది. యథారాజా తథా ప్రజ అన్న చందంగా అధికారుల తీరు ఉంటోంది. అధికారులు అప్పటికప్పుడు హడావిడి చేయడం తప్ప మరోటి కానరావడం లేదు. ఎపిలో గ్యాస్ లీక్ ప్రమాదాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో కుక్కల గుంపులు అనేకమందిని బలి తీసుకున్నాయి. ఉదయం ఒంటరిగా వెళ్లలేని పరస్థితి ఉంది. నగరంలో దాదాపు 4 లక్షల 61 వేల కుక్కలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే వీటికి తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా మరో ఐదు లక్షలు ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉంటాయని తెలుస్తోంది. ఇందులో జర్మన్ షెఫర్డ్, డాబర్మెన్ లాంటిలాంటి భయంకరమైన కుక్కలు కూడా ఉన్నాయి. ఈ కుక్కలన్నీ వీధుల్లో తిరుగుతూ.. సామాన్య ప్రజలకు భయ భ్రాంతులను కలిగిస్తున్నాయి. అలాగే కుక్కల దాడితో ప్రమాదాలు జరుగతున్న ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు చేస్తున్న ఖర్చు వల్ల ప్రభుత్వ ఖాజానా గుల్ల అవుతోందే తప్ప లక్ష్యం నెరవేరడం లేదని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె. కాశీనాథ్ గతంలో అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చారు. కుక్కలు పరుగెత్తుకుని వస్తున్న సందర్భాల్లో టూవీలర్‌పై పోతూ కిందపడి దెబ్బలు తాకిన వారు, ప్రమాదాలకు గురయిన వారు అనేకులు ఉన్నారు. అలాగే నడకదారిలో ఇవి అడ్డగించి కరుస్తున్న కేసులు అనేకం ఉన్నాయన్నారు. పిల్లలు వీధుల్లో లేదా పార్కుల్లో స్వేచ్ఛగా ఆడుకునే పరిస్థితి నగరంలో లేదు. పెట్ డాగ్స్‌కు లైసెన్స్ తప్పనిసరి చేసి,నిబంధనల మేరకు పెంచుతున్నారా లేదా అన్నది కూడా చూడాల్సి ఉంది. కుక్కల కోసం నగర శివార్లలో సషెల్టర్లు ఏర్పాటు చేసి, స్టెరిలైజ్ చేయడం వల్ల మంచి ఫలితాలతో పాటు డాగ్ లవర్స్‌కు కూడా వాటిని రక్షించుకునే అవకాశం ఉంటుంది. నగరంలో ఉన్న వీధికుక్కల్లో 75 శాతం కుక్కలు అంటే 3 లక్షల20 వేల కుక్కలకు స్టేరిలైజేషన్ పూర్తి చేశామని బల్దియా వెటర్నరీ ఆఫీసర్లు చెబుతున్నారు. నగరంలో వీధి కుక్కలు, కోతుల సమస్యను పరిష్కరిం చేందుకు తోణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతంలో కుక్క కరిచి ఓ బాలుడు చనిపోతే.. ఆ కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం కేవలం సారీ చెప్పి చేతులు దులుపుకుందని పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఆనాడు ఆరోపించారు. కనీస సానుభూతి చూపని రాక్షస ప్రభుత్వం ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు కనీస చర్యలకు ఆయన కూడా ఉపక్రమించడం లేదు.



# ఏఐసీఎస్ క్రికెట్ జట్టు ఎంపికైన కార్యదర్శి తిలక్

**కారేపల్లి, ఫిబ్రవరి22(జనంసాక్షి) :** ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ క్రికెట్ జట్టుకు ఖమ్మం జిల్లా, సింగరేణి మండలం సూర్యతండ చెందిన పంచాయతీ కార్యదర్శి భూక్యా తిలక్ కిషోర్ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల సంఘం క్రికెట్ పోటీలలో కార్యదర్శి తిలక్ కిషోర్ జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలలో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో జట్టుకి అండగా నిలిచి గెలుపులో కీలకపాత్ర పోషించారు. తిలక్‌కిషోర్ ప్రతిభను గురించి రాష్ట్ర తరుపున అల్‌ఇండియా సివిల్ సర్వీస్ క్రికెట్ పోటీలలో పాల్గనున్నారు. ఖమ్మం జిల్లా నుండి తిలక్ కిషోర్ ఒక్కరే ఎంపిక అయ్యారు. మార్చి 14 నుండి 26 వరకు ఢిల్లీలో జరగబోయే పోటీలలో తిలక్ కిషోర్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఎంపికైన తిలక్‌కిషోర్‌ను సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారులు అభినందించారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

**కారేపల్లి, ఫిబ్రవరి 22(జనంసాక్షి) :**



మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షణ ఖరారైనట్లు కారేపల్లి ఎన్.రాజారాం తెలిపారు. ఇటీవల కామేపల్లి మండలానికి చెందిన శివకుమార్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా కారేపల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుకోని కోర్టు ప్రవేశపెట్టగా అతనికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వాహన చోధకులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై కోరారు.



# ఉపాధీ హామీ పనులను పరిశీలించిని పీడీ

## పనులను గుర్తింపు వేగవంతం చేయాలి పీడీ సన్యాసయ్య

**కారేపల్లి, ఫిబ్రవరి22(జనంసాక్షి) :** కారేపల్లి మండలం ఉపాధీ హామీ పనులను డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య శనివారం పరిశీలించారు. గాజులతండా, ఉసిరికాయలపల్లిలో పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్ళి పనులను పీడీ తనిఖీ చేసారు. ఈసందర్బంగా పీడీ మాట్లాడుతూ ఉపాధీ పనులను ప్రతి గ్రామంలో ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజా అవసర పనులు గుర్తింపు వేగవంతం చేయాలని, పనులకు కూలీల సంఖ్యను పెరిగేలా కార్యదర్శులు చొరవచూపాలన్నారు. ఐకేపీ కార్యాలయంలో సర్ప్ సీసీలతో సమావేశం నిర్వహించారు. లింకేజీ, స్త్రీనిధి ప్రగతిపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఏపీవో కోటేశ్వరరావు, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.